క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మునగాల : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024– 25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతిలో 100 సీట్లు, ఏడు నుంచి పదవ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుకు ఫిబ్రవరి 22 వరకు అవకాశం ఉందని, ప్రవేశపరీక్ష ఏప్రిల్ 7 ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గణిత ఒలింపియాడ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ



రెండవ లెవల్‌కు ఎంపికైన విద్యార్థులు

కోదాడ : సైన్స్ ఒలింపియాడ్ ఇటీవల నిర్వహించిన మాథ్స్ ఒలింపియాడ్‌లో కోదాడలోని జయ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి రెండవ లెవల్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన 5 నుంచి 9 తరగతుల విద్యార్థులు త్రివేద్ రిషి, డి.ప్రతిభ పహర్, టి.వర్షిణి, పి.సిద్ధార్థ మైత్రేయ్, సీహెచ్.అక్షయ్ రెండవ లెవల్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు బహుమతులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు క్యాట్ ఒలింపియాడ్ పరీక్ష (రెండో లెవల్) లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నగదు బహుమతులు, మెడల్స్ సాధించారని హెచ్‌ఎం వెంకట రమణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి 96 మంది విద్యార్థులు పాల్గొనగా ఐదుగురు విద్యార్థులకు రూ.1వేయి నగదు బహుమతి, 15 మందికి సర్టిఫికేట్లు, మరో 40 మంది మెరిట్ సర్టిఫికెట్లు పొందారని ఆయన తెలిపారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం బహూకరణ



హెచ్‌ఎంకు సౌండ్ సిస్టం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, క్లబ్ సభ్యుడు పోరెడ్డి శ్రీరాంరెడ్డి రూ. 11వేల విలువ గల సౌండ్ సిస్టంను పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు బట్టు మధుకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు కొణతం సత్యనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ఆదిరెడ్డి, ఉపాధ్యాయులు సర్వ కుమారి, రషీద్, శౌరి, వెంకటేశ్వర్‌రావు, నర్సింహారావు, అన్నపూర్ణ, మాధవి, భవాని, రవి, కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రావు, శ్రవంతి, సరస్వతి తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



3వ వార్డులో బోరు వేయిస్తున్న సర్పంచ్

మునగాల : మునగాల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని మూడవ వార్డులో గత కొంతకాలంగా తాగునీటి సమస్యతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో గురువారం సర్పంచ్ చింతకాయల ఉపేందర్ నూతన బోరు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి సమస్య ఉన్న వార్డులను గుర్తించి పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్.వెంకయ్య, వార్డు సభ్యులు కొండా రామాంజి, దేవినేని ఉష, లంజేపల్లి స్పందన, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుక్కడపు లక్ష్మయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఓకు ఫిర్యాదు

కోదాడ : పట్టణంలో సర్వే నంబర్ 149లో ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి సర్వే అధికారులు తరచూ తప్పుడు రిపోర్టు ఇస్తున్నారని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోదాడకు చెందిన సామాజిక కార్యకర్త పొడుగు హుస్సేన్ గురువారం ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. గతంలో సర్వే నంబర్ 149ని రాష్ట్ర స్థాయి అధికారులు సర్వే చేశారని, దీనిపై మరోసారి సర్వే చేయలేనని చెప్పిన జిల్లా సర్వే అధికారులు తాజాగా మరోసారి సర్వేకు రావడం గతంలో ఇచ్చిన రిపోర్టును ఉల్లంఘించడమేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని ఆర్డీఓ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

తొలగిస్తేనే ప్రయాణం సుగమం

- అడ్డంకిగా ట్రాఫిక్ అవుట్ పోస్టులు
- లారీ ఢీకొట్టడంతో కూలిన గది
- పునర్నిర్మిస్తున్న పోలీస్ అధికారులు
- తొలగించాలని ఎస్పీకి వాహనదారుల ఫిర్యాదు
- సమస్యపై గతంలోనే 'సాక్షి'లో వార్తాకథనం



ఖమ్మం క్రాస్ రోడ్డులో లారీ ఢీకొట్టడంతో కూలిన అవుట్ పోస్టును తిరిగి కట్టిస్తున్న పోలీస్ అధికారులు

కోదాడ : పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కేవలం వ్యాపార ప్రకటనల కోసమే వీటిని ఏర్పాటు చేశారని, వాటిల్లో ఏనాడు పోలీసులు ఉండి ట్రాఫిక్‌ను నియంత్రించలేదని, వీటిని తొలగించి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు. అయినా పోలీస్ అధికారులు మాత్రం చేస్తాం.. చూస్తాం అంటూ కాలం గడుపుతున్నారు. కాగా, రెండు వారాల రోజుల క్రితం ఖమ్మం క్రాస్ రోడ్డులో ఉన్న ట్రాఫిక్ అవుట్ పోస్టును లారీ ఢీ కొట్టింది. దీంతో లారీ యజమాని చేత తిరిగి కట్టిస్తుండడం ప్రస్తుతం విమర్శలకు తావిస్తోంది.

ఎస్పీకి పలువురి ఫిర్యాదు

కోదాడ పట్టణంలోని ప్రధాన రహదారిపై ముఖ్య కూడళ్లైన రంగా థియేటర్ సెంటర్, ఖమ్మం క్రాస్ రోడ్డుతో పాటు పలు సెంటర్లలో ట్రాఫిక్ అవుట్ పోస్టుల పేరుతో రహదారి మధ్యలో గదులు నిర్మించారు. మరి కొన్ని చోట్ల పోలీస్ కంట్రోల్ పాయింట్లు పెట్టారు. అయితే ఇవి మూలమలుపుల్లో యూటర్న్ తీసుకొనే వాహనాలు, ముఖ్యంగా పాఠశాల, కళాశాల, ఆర్టీసీ బస్సులకు తీవ్ర అడ్డంకిగా మారాయి. ఈ సమస్యపై సాక్షి'30– 03– 22న ×నిరుపయోగంగా.. దారికి అడ్డంగా'అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన నాటి అధికారులు వీటిని తొలగిస్తామని చెప్పారు. కానీ నేటికీ తొలగించలేదు. ఈ క్రమంలో పది రోజుల క్రితం లారీ ఖమ్మం క్రాస్ రోడ్డులో అవుట్ పోస్టును ఢీకొట్టడంతో అది కూలిపోయింది. ఢీకొట్టిన వారి చేత మళ్లీ అక్కడే అవుట్ పోస్ట్ కట్టిస్తున్నారు. దీనిపై పలువురు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఇటీవల కోదాడ డీఎస్పీ పరిశీలించి అవుట్‌పోస్టులను తొలగించాలని ట్రాఫిక్ ఎస్ఐని ఆదేశించారు. దీంతో పాటు పట్టణంలో ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న అవుట్ పోస్టులు, ట్రాఫిక్ బూత్‌లు, ఇతర నిర్మాణాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.


నిరుపయోగం.. దారికి అడ్డం

అవుట్ పోస్టుల సమస్యపై సాక్షిలో గతంలో ప్రచురితమైన కథనం

వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు

ప్రధాన రహదారి అసలే ఇరుకుగా ఉంది. ఆపై మూలమలుపుల్లో పెద్ద గదులు కట్టారు. ఒక్కరోజు కూడా అందులో పోలీసులు ఉన్నది లేదు. వీటి వల్ల యూటర్న్ తీసుకొనే వాహనాదారులకు ఇబ్బందిగా ఉంది. వెంటనే వీటిని తొలగించడంతో పాటు, రంగా థియేటర్, ఖమ్మం క్రాస్‌రోడ్డు సెంటర్‌లలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి.

– కురదవెళ్లి బసవయ్య, సామాజిక కార్యకర్త, కోదాడ

నిర్మాణ పనులు ఆపాలని చెప్పాం

ఖమ్మం క్రాస్ రోడ్డులో ట్రాఫిక్ అవుట్ పోస్టును ఇటీవల లారీ ఢీకొట్టడంతో తిరిగి వారే కడుతున్నారు. దీనిపై కొందరు ఫిర్యాదు చేయడంతో పరిశీలించాను. వెంటనే నిర్మాణ పనులను ఆపివేసి, మున్సిపల్ అధికారుల సాయంతో అక్కడి నుంచి దాన్ని తొలగించమని చెప్పాం. మిగతావాటి విషయం కూడా పరిశీలించి చర్యలు తీసుకుంటాం

– ప్రకాశ్, డీఎస్పీ, కోదాడ

పట్టభద్రులు ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

- ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : గ్రాడ్యుయేట్ పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఓటు హక్కు పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 1 నవంబర్ 2020 నాటికి డిగ్రీ పాసైన వారు మాత్రమే అర్హులని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు కోసం ఆన్‌లైన్‌లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు డిగ్రీ మెమోను గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎన్నికల ఉప తహసీల్దార్ కమలాకర్, చిలక కిషోర్ కుమార్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు మత సామరస్యానికి ప్రతీక



గంధం తీసుకెళ్తున్న నాయకులు

కోదాడఅర్బన్ : ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీక అని పలు పార్టీలకు చెందిన నాయకులు పేర్కొన్నారు. గురువారం రాత్రి కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురంలో ప్రసిద్ధిగాంచిన హజరత్ మౌలాలి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరంగాపురం నుంచి ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద గల దర్గా వద్దకు గంధంను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కందుల చంద్రశేఖర్, ఉర్సు కమిటీ అధ్యక్షుడు బొజ్జిమియా, మేస్త్రీ సైదా, ఉమర్ జాన్, సలీం, బుజ్జి, నాగుల్, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో వైభవంగా శాకాంబరీ ఉత్సవాలు



శాకాంబరీ అలంకరణలో శ్రీకనకదుర్గ అమ్మవారు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీకనకదుర్గ దేవాలయంలో గురువారం శాకాంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని ఆకుకూరలు, కూరగాయలు, పూలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ అవార్డుకు ఎంపిక



ఉపాధ్యాయుడు చందా శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు



ప్రయోగాన్ని చూపుతున్న చందా శ్రీనివాస్‌రావు

చిలుకూరు : తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ఆధ్వర్యంలో అందజేసే ఇంటింటా ఇన్నోవేటర్– 2024 రాష్ట్ర స్థాయి అవార్డుకు చిలుకూరు మండలంలోని బేతవోలు జిల్లా పరిషత్ పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు చందా శ్రీనివాస్‌రావు ఎంపికయ్యారు. ఈమేరకు ఆయన గురువారం స్థానికంగా విలేకరులకు తెలిపారు. తక్కువ ఖర్చుతో ఆహార పదార్థాలను పరోక్షంగా సూర్యరశ్మి సహాయంతో రంగు, రుచి వాసన లేకుండా, పోషక విలువలు పోకుండా, ఎలాంటి రక్షణ లేకుండా ఎండపెట్టుకోవడానికి ఈ పరికరం కనిపెట్టినట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణకు 2023లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా స్థాయి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇదే ప్రయోగం ఇంటింటా ఇన్నోవేషన్ -2024 రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైనట్లుగా తెలిపారు. ఈ ప్రయోగం తిలకించిన ప్రధానోపాధ్యాయులు తేజోరాం, సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, ఎంపీటీసీలు నెమ్మాది సైదాబాబు, వట్టికూటి ధనమూర్తి, ఎస్‌ఎమ్‌సీ చైర్మన్ రమాదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావును అభినందించారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



కోదాడఅర్బన్ : కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్, విద్యార్థులు

హుజూర్‌నగర్ : 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి శ్యాం కుమార్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం హుజూర్‌నగర్‌లోని కొత్త బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి చేసేవారికే ఓటు వేయాలని, అప్పుడే ప్రజాస్వామ్యం మనగలుగుతుందని అన్నారు. రెండు చోట్ల ఓటు కలిగి ఉండడం ప్రజాప్రతినిధ్య చట్టం ప్రకారం నేరం అవుతుందని తెలిపారు. అనంతరం ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ నాగార్జున రెడ్డి, ఏజీపీ గోపాలకృష్ణ, సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ సభ్యుడు ధర్మూరి వెంకటేశ్వరు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

కోదాడఅర్బన్ : ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగు అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్రం విభాగాలు సంయుక్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎస్.రామారావు, టి.రాజు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఎస్.సైదమ్మ, ఎస్ఎం రఫీ, అధ్యాపకులు సత్యవాణి, డాక్టర్ కె.సైదులు, డాక్టర్ పల్లపాటి సైదులు, రాంబాబు, డాక్టర్ ఎం.శ్రీనివాస్ ఆర్.వెంకటరెడ్డి, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూ అరబిందో డిగ్రీ కళాశాలలో..

నేరేడుచర్ల : పట్టణంలోని న్యూ అరబిందో డిగ్రీ కళాశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. తదనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కట్టా ప్రవీణ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు పోరెడ్డి శ్రీరాంరెడ్డి, జిలకర రామస్వామి, శ్రీధర్, ప్రభాకర్, వెంకన్న, లింగారెడ్డి, బట్టు మధు తదితరులు ఉన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కర్నాటి శ్రీధర్, కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

మండలంలోని చెన్నకేశ్వాపురంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్యాంకుమార్



నేరేడుచర్ల : న్యూ అరబిందో డిగ్రీ కళాశాలలో..



నడిగూడెం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బుస్సా సులోచన, కరస్పాండెంట్ బుస్సా మహేష్, ఉపాధ్యాయులు సైదులు, వీరయ్య, హర్ష, లక్ష్మి, మల్లిక, వైదేహి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ తహసీల్దార్‌గా ఆంజనేయులు



అదనపు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న తహసీల్దార్ ఆంజనేయులు

మునగాల : ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించిన మునగాల మండల తహసీల్దార్ పి.ఆంజనేయులు ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక చేతుల మీదుగా ఆంజనేయులు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆంజనేయులును కార్యాలయ సిబ్బంది, పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు అభినందించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

నేరేడుచర్ల : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు కోరారు. గురువారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోతున్నాయన్నారు. సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి బోర్లు, బావుల కింద సాగు చేసిన పంటలను కాపాడాలని తెలిపారు. ప్రస్తుతం తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి సింహాద్రి తదితరులు ఉన్నారు.

లిఫ్ట్ పనులు నిలిపివేయాలని వినతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని పాత వెల్లటూరు వద్ద నిర్మించతలపెట్టిన ఎంబీసీ లిఫ్ట్ పనులు నిలిపివేయాలని కోరుతూ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు భూ నిర్వాసిత రైతులు గురువారం తెలిపారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, మౌలాలి, వెంకటాచారి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలో విజేతలుగా నడిగూడెం ఉపాధ్యాయులు



జిల్లా జడ్జి రాజగోపాల్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న శ్రీనివాస్, గోపిరెడ్డి

నడిగూడెం : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సూర్యాపేటలో గత రెండు రోజులుగా ఉద్యోగులకు నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో నడిగూడెం మండలంలోని రామాపురం, ఎకలాస్‌ఖాన్ పేట, కోదాడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, జట్టు కెప్టెన్ బుర్రి శ్రీనివాస్, కొంపెల్లి గోపిరెడ్డి మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, గోవిందరెడ్డి, రవి, వెంకటేశ్వర్లు జిల్లా స్థాయిలో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. గురువారం సూర్యాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా జడ్జి జి.రాజగోపాల్, జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, అడిషనల్ కలెక్టర్ సీహెచ్.ప్రియాంక, ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనా చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. బహుమతులు సాధించిన ఉపాధ్యాయులను ఎంఈఓ ఎండీ.సలీం షరీఫ్ అభినందించారు.

కేటీఆర్‌ను కలిసిన పీఏసీఎస్ చైర్మన్ రామారావు



తనపై అవిశ్వాసం గురించి కేటీఆర్‌కు వివరిస్తున్న కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల రామారావు

కోదాడఅర్బన్ : తన పదవిపై గురువారం అవిశ్వాస తీర్మానం పెట్టడంతో కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల రామారావు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని వివరించినట్లు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. పార్టీ పరంగా తనకు పూర్తి మద్దతు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీ డైరెక్టర్లను ప్రలోభ పెట్టి అవిశ్వాస తీర్మానానికి తెరలేపినట్లు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు రామారావు తెలిపారు. కాగా, ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, నాయకులు ఎవరు అధైర్య పడవద్దని, తాత్కాలికంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించినా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో ప్రస్తుత ప్రభుత్వం ప్రజలను ఎలా మభ్యపెడుతుందో త్వరలోనే తెలుసుకుంటారనే భరోసాను కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఇచ్చినట్లు ఆయన చెప్పారు.

స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలి

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ చెల్లిస్తామన్న హామీని బీజేపీ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను ధిక్కరిస్తూ దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకన్న, సీతయ్య, మధార్, రాంబాబు, నరేష్, అంజయ్య, రామకృష్ణ, సైదులు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానివి కార్మిక వ్యతిరేక విధానాలు

గరిడేపల్లి : కేంద్ర ప్రభుత్వానివి కార్మిక వ్యతిరేక విధానాలు అని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కోనాయిగూడెం గ్రామంలో అంబటి సైదులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సాగర్ నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ అంబటి భిక్షం, నందిపాటి మట్టయ్య, పెద్దబాష, పుట్ట లక్ష్మయ్య, సకినాల వెంకన్న, వెంకటప్పయ్య, మల్సూరు, చిన్న బాషవీరయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

మాంసం విక్రయాలపై నేడు నిషేధం

హుజూర్‌నగర్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా హుజూర్‌నగర్‌లో శుక్రవారం మాంసం విక్రయాలపై నిషేధం విధించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో చికెన్, మటన్, చేపలు ఇతర మాంసం విక్రయాలు జరుపరాదని ఆయా దుకాణాలను మూసివేయాలని ఆయన తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి సిద్ధమైన రంగులతో భారతదేశ పటం



శ్రీ అరబిందో పాఠశాలలో భారతదేశ పటం వేస్తున్న విద్యార్థులు

గరిడేపల్లి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల శ్రీ అరబిందో ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం ప్రకృతి సిద్ధంగా లభించే రంగులతో భారతదేశ పటం, పూర్ణ కుంభాలను వేశారు. ప్రకృతిలో లభించే పూలు, కాయలు, పండ్లచే రంగులు తయారు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.